www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -105 సోమవారం 14 జులై 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545



## విలక్షణ నటుడు

# కోట కన్నుమూత

### వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్లో తుదిశ్వాస

- అంత్యక్రియలకు హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు
- నివాళి అర్పించిన ఏపీ సీఎం చంద్రబాబు,
- తెలంగాణ సీఎం రేవంత్
- బహుముఖ ప్రజ్ఞాశాలికోట మృతిపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి
- రాష్ట్రపతి సహా ప్రముఖుల సంతాపం

2లో



- తెలుగు చలన చిత్రసీమ కన్నీరుమున్నీరు
- విలనిజానికికొత్త రూపు ఇచ్చిన నటదిగ్గజం
- 750 చిత్రాలతో చెరగని ముద్ర
- వరించిన 9 నంది అవార్డులు, పద్మశ్రీ
- విజయవాడలోబీజేపీ ఎమ్మెల్యేగా సేవలు

పిసినారిగా, మధ్యతరగతి తండ్రిగా, అల్లరి తాతయ్యగా, అవినీతి నాయకుడిగా, కామెడీ విలన్గా, నవ్వించే పోలీస్గా, భయపెట్టే మాంత్రికుడిగా ఇలాంటి ఎన్నో పాత్రలకు తన నటనతో జీవం పోసిన విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు (83) కన్నుమూశారు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారు జామున ఫిల్మ్నగర్లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు.

# బోనాల సంబరం..

### ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయానికి విచ్చేసిన రేవంత్ రెడ్డి
- ఇతర మంత్రులు కూడా ఈ వేడుకలో పాల్గొన్న వైనం
- ప్రత్యేక పూజలు చేసిన సీఎం, మంత్రులు



**సికింద్రాబాద జులై 13 ప్రజావినికిడి**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాడు సికింద్రాబాద్లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి లష్కర్ బోనాల సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పలువురు కేబినెట్ సహచరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సాంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.మంత్రి సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. మిగతాది 2లో...



## ఐదేళ్ల కాలవ్యవధితో ఏపీ

# అంతరిక్ష విధానం

- స్పేస్ పాలసీ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- స్పేస్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆదేశాలు
- దేశీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం



**అమరావతి జులై 13 ప్రజావినికిడి**
ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ఐదేళ్ల కాలానికి వర్తించే కొత్త అంతరిక్ష విధానాన్ని (స్పేస్ పాలసీ) ప్రకటించింది. ఈ విధానాన్ని అమలు చేయడానికి రాష్ట్ర స్పేస్ సిటీ కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.ఈ స్పేస్ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, స్టార్టప్లకు నిధులు సమకూర్చడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం పెట్టుకుంది. దేశీయ, అంతర్జాతీయ సంస్థలను ఈ ప్రాజెక్టులలో భాగస్వామ్యులుగా చేసుకోవాలని సూచించింది.స్పేస్ సిటీ కార్పొరేషన్ అంతరిక్ష ప్రాజెక్టుల అమలుకు సహాయం చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ స్పేస్ సిటీలు సత్యసాయి మరియు తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేయబడతాయి. భూ కేటాయింపులు మరియు దరఖాస్తుల పరిశీలన వంటి ప్రక్రియలు ఒక కమిటీ ద్వారా అనుమతులు పొందుతాయని ప్రభుత్వం తెలియజేసింది.

## రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు నలుగురు

- ఇద్దరు బీజేపీ నేతలు, మరో ఇద్దరు అనుబంధ సభ్యులు
- నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము



2లో



## ఎమ్మెల్సీల జగడం

- తీన్మార్ మల్లన్న ఆఫీసుపై జాగృతి కార్యకర్తల దాడి
- గన్మెన్ కాల్పులు
- కవితనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణ
- దాడులతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరన్న మల్లన్న

2లో

## రైలు కోచ్ లలో సీసీ కెమెరాలు

- రైళ్లలో ఇక భద్రతకు పెద్దపీట... చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుంది!
- ప్రయాణికుల భద్రతపై రైల్వే శాఖ కీలక నిర్ణయం
- ఇప్పటికే ట్రయల్స్ నిర్వహణ



2లో

# విలక్షణ నటుడు కోట కన్నుమూత



**జులై 13 ప్రజావినికిడి :**
నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో భిన్న పాత్రలు పోషించి తెలుగువారి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించు కున్నారు. ఎస్వీ రంగారావు, కైకాల సత్యనారాయణ, రావు గోపాలరావు శకం ముగిసిన తరువాత ఆ లోటును భర్తీ చేసిన నటుడు కోట శ్రీనివాసరావే. తన నటనతో ఓ పక్కన నవ్విస్తూనే.. మరోపక్క ప్రతి నాయకుడిగా విలనిజానికి సరికొత్త అర్థం చెప్పి ప్రేక్షకులతో శభాష్ అనిపించుకున్న వైనమే ఆయన్ని అరుదైన విలక్షణ నటుడిగా నిలబెట్టింది.

కోట శ్రీనివాసరావు 1942 జూలై 10న కృష్ణాజిల్లా కంకిపాడులో జన్మించారు. చిన్నప్పట్నుంచే నటన అంటే అమితాసక్తి. దీనికితోడు తన అన్నయ్యలు ఇద్దరూ కూడా నటన అంటే మక్కువ కలవారే కావడంతో రంగస్థలం వైపు నడిచేలా చేసింది. ఓ పక్క స్టేట్‌బ్యాంక్‌లో పనిచేస్తూనే మరో పక్క నాటకాల్లో నటించడం మొదలుపెట్టారు.

కోటను చిత్రసీమకు పరిచయం చేసింది దర్శకుడు కె.వాసు. ఆయన తెరకెక్కించిన 'ప్రాణం ఖరీదు' (1978)తోనే కోట తొలిసారి తెరపై తళుక్కు మన్నారు. ఇదే సినిమాతో చిరంజీవి కెరీర్ స్టార్ట్ కావడం విశేషం.

నాటకాల్లో కోట ప్రతిభను గమనించిన జంధ్యాల 'అమరజీవి', 'బాబాయ్ %-% అబ్బాయ్' వంటి తదిరత చిత్రాల్లో అవకాశాలిచ్చి ప్రోత్సహించారు. ఇటువంటి తరుణంలో కోట నట జీవితాన్ని 'ప్రతిఘటన' మలుపు తిప్పింది. టి.కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రంలో 'నమస్తే తమ్మీ..' అంటూ తెలంగాణ యాసతో మినిస్టర్ కాశయ్యగా కోట అభినయం అందరినీ ఆకట్టుకుంది. ఇందులోని నటనకుగాను ఆయన తొలి నంది అవార్డును అందుకున్నారు. అంతేకాదు సినిమాల్లో తెలంగాణ మాండలికం ప్రాముఖ్యత పెరిగేందుకు దోహం చేసిందీ పాత్రే కావడం మరో విశేషం.

అలాగే జంధ్యాలను సైతం 'ప్రతిఘటన' సినిమా మురిపించింది. కోటలోని నటునికి ఛాలెంజ్ విసిరేలా ఆయన 'అహ%౧%నా పెళ్ళంట' సినిమా కోసం 'లక్ష్మీపతి' పాత్రను క్రియేట్ చేశారు. జంధ్యాల అంచనాలను మించి ఆ పాత్రలో కోట అత్యద్భుతంగా నటించారు.

అందులో పలు సన్నివేశాల్లో కోట పూయించిన నవ్వులు ఈనాటికీ గుబాళిస్తూనే ఉండడం విశేషం. సురేశ్ ప్రొడక్షన్స్ అధినేత డి.రామానాయుడు నిర్మించిన ఈ సినిమా ఘనవిజయం సాధించింది. అయితే ఈ కథను జంధ్యాల నెరేట్ చేసినప్పుడు నిర్మాత రామానాయుడు 'లక్ష్మీపతి' పాత్రలో రావుగోపాలరావుని ఊహించుకున్నారు. కానీ ఈ పాత్రకు కోట అయితే బాగుంటుందని రామానాయుడిని అతికష్టమ్మీద జంధ్యాల ఒప్పించారు. అప్పటి వరకు మంచి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న కోటకు 'అహ..నా పెళ్లంట' సక్సెస్‌తో వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

కామెడీ విలన్‌గా ప్రేక్షకులను కితకితలు పెట్టిన కోట 'గణేష్' సినిమాలో క్రూరమైన విలన్ పాత్రలో వణుకు పుట్టించారు. ప్రజల రక్తం తాగే ఆరోగ్య మంత్రిగా ఆయన పలికించిన హావభావాలు ఒళ్ళు గగుర్పొడిచేలా ఉంటాయి. ఈ సినిమాలో గుండుతో, భయంకరమైన కళ్ళతో ఆయన ఆహార్యం



కూడా భయంకరంగా ఉంటుంది.

'గాయం'లో 'గదైతే నేను ఖండిస్తున్న' అంటూ గురు నారాయణ్ పాత్రతో కోట తెరపై చేసిన సందడేమీ తక్కువ కాదు. ఈ పాత్రకు విరుద్ధంగా 'మనీ' సినిమాలో బట్లర్ ఇంగ్లీష్‌తో మాట్లాడే అల్లాదీన్‌గా ప్రేక్షకులను మనసారా నవ్వించారు.

అలాగే 'మామగారు' సినిమాలో పోతురాజుగా కోట ఆకట్టుకున్నారు. ఈ సినిమాతోనే బాబూ మోహన్, కోట కాంబినేషన్‌కి మంచి క్రేజ్ ఏర్పడింది. ఈ ఇద్దరి కాంబో దాదాపు 100 సినిమాల్లో నటించింది. ఈ కాంబో అంటే ప్రేక్షకులకు నవ్వులే నవ్వులు.

ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జీవితంలోని కొన్ని సంఘటనలు ఆధారంగా చేసుకుని 'మండలాధీశు డు' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌లా కోట నటించారు. అయితే ఇందులో నటించిన తీరు, చెప్పిన డైలాగ్‌ల విధానంపై కోట తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, పవన్ కళ్యాణ్, మహేష్‌బాబు వంటి స్టార్ హీరోల దగ్గర్నుంచి నేటి తరం హీరోల చిత్రాల్లోనూ నటించి మెప్పించిన ఘనత కోటదే. 4 దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో తెలుగులో 750 చిత్రాలకు పైగా నటించి చెరిగిపోని ముద్ర వేశారు. తమిళం, కన్నడ, హిందీ, మలయాళం సినిమాల్లో నటించా రాయన. ప్రజానాయకుడిగానూ ప్రజల్లో మంచి స్థానం సొంతం చేసుకున్నారు. 1999-2004 వరకు విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా చేశారు. ఆయన నటించిన చివరి చిత్రం 'హరి హర వీరమల్లు'.

విలక్షణ పాత్రలకు, వైవిధ్యమైన సినిమాలకు కేరాఫ్‌గా నిలిచిన కోట తన నట జీవితంలో తొమ్మిది నంది పురస్కారాలను అందుకున్నారు. ప్రతిఘటన (1995), గాయం (1993), తీర్పు (1994), లిటిల్ సోల్జర్స్ (1996), గణేష్ (1998), చిన్న (2000), పృథ్వీనారాయణ (2002), ఆ నలుగురు (2004), పెళ్ళైన కొత్తలో (2006) చిత్రాలకు నంది అవార్డులను దక్కించుకున్నారు. అలాగే 2012లో 'కృష్ణం వందే జగద్గురుమ్' సినిమాకు సైమా అవార్డును అందుకున్నారు. అరుదైన విలక్షణ నటుడిగా సినీ పరిశ్రమకు చేసిన సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం 2015లో ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారంతో సముచితంగా గౌరవించింది.

'ప్రతిఘటన'లో మినిస్టర్ కాశయ్యగా తనదైన నటనతో ప్రేక్షకుల్ని అబ్బురపరచిన కోట తెలుగునాట ప్రతిభగల నటీనటులకు కొదవ లేదని వాదించిన సందర్భాలు కోకొల్లలు. మనవాళ్ళకి కాకుండా అర్హత లేని పరభాషా నటీనటులకు తెలుగుచిత్ర పరిశ్రమ అధిక ప్రాధాన్యం ఇవ్వడాన్ని తప్పుపడుతూ ఎన్నోసార్లు బహిరంగంగా చర్చించిన ఏకైక నటుడు కూడా కోటనే.

కోట శ్రీనివాసరావుకు ఇద్దరు కూతుర్లు, కొడుకు ప్రసాద్ ఉన్నారు. అయితే కొన్నేళ్ళ క్రితం కొడుకు ప్రసాద్ ఓ ప్రమాదంలో చనిపోయారు. అప్పట్నుంచి మానసికంగా కోట బాగా కృంగిపోయారు. అయినప్పటికీ వెండితెరపై ఆ బాధని తెలియనీకుండా అలరించారు. కుటుంబ సభ్యులు, అభిమానుల కన్నీటి వీడ్కోలుతో కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం మహా ప్రస్థానంలో ముగిశాయి. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర జరిగింది.

# బోనాల సంబరం..

**(మొదటి పేజి తరువాయి)**

ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తన అర్ధాంగితో కలిసి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని తాను ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.మహిళా భక్తులు అన్నం, బెల్లం, పెరుగు, వేప ఆకులతో వండిన 'బోనం'ను అమ్మవారికి సమర్పించారు. ఆలయం, దాని చుట్టుపక్కల వీధులన్నీ పండుగ వాతావరణంతో నిండిపోయాయి. సంప్రదాయ వస్త్రధారణతో ఉన్న మహిళలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేడుకలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఈ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. 'రంగం'తో ఈ పండుగ ముగుస్తుంది. ఈ 'రంగం'లో అవివాహిత మహిళ రాష్ట్ర భవిష్యత్తు గురించి అంచనాలను వెల్లడిస్తారు. ఆ తర్వాత ఘట్టాల ఊరేగింపు జరుగుతుంది. దీని తరువాత అమ్మవారి చిత్రపటాన్ని మోస్తున్న అలంకరించిన ఏనుగుతో ఊరేగింపు ఉంటుంది. పసుపు, కుంకుమ పూసుకున్న పోతరాజులు లయబద్ధమైన డప్పుల శబ్దానికి నృత్యం చేస్తూ ఊరేగింపుగా వివిధ ప్రాంతాల గుండా వెళతారు.ఆషాఢ బోనాలు హిందూ క్యాలెండర్ ప్రకారం ఆషాఢ మాసంలో మహంకాళి అమ్మవారిని ఆరాధించే పండుగ. భక్తులు, ముఖ్యంగా మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన కుండలలో ఆహారం రూపంలో నైవేద్యాలు సమర్పిస్తారు.

ఈ పండుగలో భాగంగా ప్రజలు 'రంగం' లేదా భవిష్యత్తు అంచనా, ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. సికింద్రాబాద్‌లో జరిగే బోనాలను లష్కర్ బోనాలు అని కూడా పిలుస్తారు. ఇది హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ జంట నగరాల్లో దాదాపు నెలరోజుల పాటు జరిగే సంప్రదాయ పండుగలో రెండవ దశ.

ఈ పండుగ గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో ప్రారంభమైంది. పాతబస్తీలోని లాల్ దర్వాజాలోని శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయం, హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి



ఆలయాల్లో వచ్చే ఆదివారం ఉత్సవాలు జరగనున్నాయి.సుమారు 150 సంవత్సరాల క్రితం కలరా వ్యాధి తీవ్రంగా ప్రబలిన తర్వాత ఈ పండుగ మొదట జరుపుకున్నారని నమ్ముతారు. మహంకాళి అమ్మవారి కోపం వలనే ఈ మహమ్మారి వచ్చిందని ప్రజలు నమ్మి, ఆమెను శాంతింపజేయడానికి బోనాలు సమర్పించడం ప్రారంభించారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించింది.

# విద్యుత్ చార్జీలు పెంచం

రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు.కడప జిల్లా పోరుమామిళ్ల పరిధిలోని 600 ఎకరాల్లో సోలార్ పరిశ్రమను ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి తీసుకొచ్చారు. మంత్రి స్పందిస్తూ..సోలార్ విద్యుత్ పరిశ్రమల ఏర్పాటుకు రాయలసీమ అనుకూల ప్రాంతమని,త్వరలో ఆ దిశగా చర్యలు చేపడతామని చెప్పారు.అనంతరం జరిగిన విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశంలోనూ..విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

# రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు నలుగురు

న్యూఢిల్లీ **జులై 13 ప్రజావినికిడి**
రాజ్యసభకు నలుగురు సభ్యులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేశారు. వీరిలో ఇద్దరు బీజేపీ సభ్యులు కాగా, మరో ఇద్దరు బీజేపీకి పరోక్షంగా అనుబంధంగా వ్యవహరించిన సభ్యులు ఉన్నారు. ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూట ర్, బీజేపీ నేత ఉజ్వల్ దేవరావు నికం, కేరళకు చెందిన బీజేపీ నేత సి. సదానందన్ మాస్టర్, మాజీ దౌత్యవేత్త హర్ష వర్ధన్ శ్రింగ్లా, చరిత్రకారిణి డాక్టర్ మీనాక్షి జైన్ ఉన్నారు. నామినేటెడ్ సభ్యులతో కూడిన జాబితాను హోం మంత్రిత్వ శాఖ ఆదివారం విడుదల చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80(1)(ఎ)లోని క్లాజ్ (3) కింద రాజ్యసభకు నలుగురు సభ్యులను నామినేట్ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. సాహిత్యం, సైన్స్, కళలు, సామాజిక సేవ తదితర రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని రాజ్యసభకు నామినేట్ చేసే ప్రత్యేక అధికారం రాష్ట్రపతికి ఉంది. విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా అమెరికా, బంగ్లాదేశ్, థాయిలాండ్‌కు అంబాసిడర్‌గా పనిచేశారు. 2023లో ఇండియా జి-20 ప్రెసిడెన్సీకి చీఫ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ప్రముఖ చరిత్రకారిణి, విద్యావేత్త మీనాక్షి జైన్ భారతదేశ నాకరికత, మత వారసత్వాన్ని చాటిచెప్పేందుకు విశేష కృషి చేశారు. విద్యా రంగంలో కృషికి 2020లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ సభ్యురాలిగా పనిచేశారు. ఉజ్వల్ దేవరావు నికమ్ 26/11 ముంబాయి ఉగ్రదాడులతో సహా అనేక ఉన్నత స్థాయి క్రిమినల్ కేసులను విచారించిన ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తరపున ముంబయి నార్త్ సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి వర్ష గైక్వాడ్ చేతిలో ఓటమి చెందారు. కేరళకు చెందిన బీజేపీ నేత సి. సదానందన్ మాస్టర్ త్రిసూర్‌లో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వర్తించారు. 2021 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి, ఓటమి చెందారు.

# ఎమ్మెల్సీల జగడం

## తీన్మార్ మల్లన్న ఆఫీసుపై జాగృతి కార్యకర్తల దాడి

ఉప్పల్**జులై 13 ప్రజావినికిడి**
ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీసు (క్యూ న్యూస్)పై జాగృతి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఎమ్మెల్సీ కవితను ద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆదివారం మేడ్చల్ జిల్లా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని బోడుప్పల్‌లోని ఆయన కార్యాలయం, సిబ్బందిపై జాగృతి కార్యకర్తలు దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అడ్డుకోబో యిన గన్‌మెన్‌ల పైనా దాడికి పాల్పడ్డారు.



దాంతో మల్లన్నను కాపాడాలని గన్‌మెన్ గాల్లోకి 5 రౌండ్లు కాల్పులు జరిపినట్టు తెలుస్తోంది. ఆఫీసులో గ్లాస్ ఫర్నిచర్ పెచ్చులు గుచ్చుకుని ఇరువర్గాలకు గాయాలు కావడంతో ఆఫీసు మొత్తం రక్తంతో నిండిపోయింది. సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

**నా మీద హత్యాయత్నం చేస్తారా.. ఇక తేల్చుకుదాం : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

క్యూ న్యూస్ ఆఫీస్‌పై దాడి ఘటనపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పందించారు. ఆఫీస్ ఎదుట మీడియాతో మాట్లాడుతూ.. దాడులతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ఇలాంటి దాడులకు మల్లన్న భయపడతాడనుకు ంటే.. భ్రమే అవుతుందని తెలిపారు. తన గన్‌మెన్ వద్ద ఉన్న తుపాకీ లాక్కొని మరీ సిబ్బందిపై దాడి చేశారని, తనతో సహా పలువురికి గాయాలయ్యాయని చెప్పారు. కల్వకుంట్ల కవిత, ఆమె కుటుంబం తనపై హత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపించారు. ఇక ఊరుకోబోమని హెచ్చరించారు. తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 'కంచం-మంచం' అనేది తెలంగాణలో ఊతపదమని, తాను చేసిన వ్యాఖ్యలకు ఇంకా కట్టుబడే ఉన్నానని తెలిపారు. తానేం తప్పు మాట్లాడానో ప్రజలు నిర్ణయిస్తారని, రౌడీల్లా దాడి చేయడమే కాకుండా.. ఎదురు కేసు పెట్టారన్నారు. తన రక్తం కండ్లజూశారని, ఆ రక్తం మరకలతోనే ప్రజల్లోకి వెళ్తానన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై స్పందించాలని కోరారు. ఈ దాడిపై ఇప్పటికే కంప్లైంట్ చేశామని, పోలీసులపై, వ్యవస్థపైనా నమ్మకముందని, న్యాయం జరుగుతుందనే నమ్ముతున్నామని తెలిపారు.

# అమరావతిలో బిట్స్ క్యాంపస్

## 35 ఎకరాల్లో రూ.1,000 కోట్లతో ఏర్పాటు

## 2027 నుంచి అందుబాటులోకి: బిర్లా

అమరావతి **జులై 13 ప్రజావినికిడి** బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) క్యాంపస్‌ను రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా తెలిపారు.రూ.1,000 కోట్ల పెట్టుబడితో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.ఆదివారం ఆయన రాజస్థాన్‌లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో విద్యార్థులు,సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లస్ (ఏఐ ప్లస్) క్యాంపస్‌ను రెండు దశల్లో దాదాపు 7వేల మంది విద్యార్థుల విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా నిర్మించనున్నామని తెలిపారు.2027 నాటికి ఇది పనిచేయడం ప్రారంభిస్తుందని చెప్పారు. 35 ఎకరాల్లో నిర్మించనున్న ఈ కొత్త క్యాంపస్ ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్,కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ బ్రాంచ్‌ల్లో అండర్ గ్రాడ్యుయేట్, మాస్టర్స్ ప్రోగ్రామ్‌లను అందిస్తుందని వివరించారు. దీనితో పాటు బిట్స్ సామర్థ్యం పెంచడం, ఏఐని అందిపుచ్చుకోవడంలో భాగంగా వచ్చే ఐదేళ్లలో మూడు ముఖ్యమైన ప్రణాళికలను ఆయన ప్రకటించారు.భారత్‌లోని క్యాంప్‌సల విస్తరణకు 'బిట్స్ విస్తార్' ప్రాజెక్టును ప్రారంభిస్తామని తెలిపారు. బిట్స్‌లో విద్యార్థుల సంఖ్యను 18,700 నుంచి 26 వేలకు పెంచడం ఈ ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు.

# రైలు కోచ్ లలో సీసీ కెమెరాలు

న్యూఢిల్లీ **జులై 13 ప్రజావినికిడి**
ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ, రైల్వే శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న 74,000 రైలు కోచ్‌లలో త్వరలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తలుపుల వద్ద ఈ కెమెరాలు అమర్చనున్నారు. ఈ చర్య ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని, ప్రయాణికులను లక్ష్యంగా చేసుకునే దుండగులు మరియు ముఠాలను నిరోధిస్తుందని అధికారులు భావిస్తున్నారు.నార్తర్న్ రైల్వేలో లోకో ఇంజన్లు మరియు కోచ్‌లలో విజయవంతంగా సీసీటీవీ కెమెరాల ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. శనివారం జరిగిన ఒక సమావేశంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టూ మరియు రైల్వే బోర్డు అధికారులు లోకోమోటివ్‌లు మరియు కోచ్‌లలో సీసీటీవీ కెమెరాల ట్రయల్స్ మరియు ఏర్పాటు యొక్క పురోగతిని సమీక్షించారు.ప్రతి రైలు కోచ్‌కు డోమ్ తరహా నాలుగు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్రవేశ మార్గంలో రెండు కెమెరాలు ఉంటాయి. అదేవిధంగా, ప్రతి లోకోమోటివ్‌లో ఆరు సీసీటీవీ కెమెరాలు ఉంటాయి. వీటిలో ఒకటి ముందు వైపు, ఒకటి వెనుక వైపు మరియు రెండు వైపులా ఉంటాయి. లోకో యొక్క ప్రతి క్యాబ్‌లో (ముందు మరియు వెనుక) ఒక డోమ్ సీసీటీవీ కెమెరా మరియు రెండు డెస్క్-మౌంటెడ్ మైక్రోఫోన్‌లు అమర్చబడతాయి.

గంటకు 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే రైళ్లలో కూడా మరియు తక్కువ వెలుతురు ఉన్న పరిస్థితుల్లో కూడా అధిక-నాణ్యత గల దృశ్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని వైష్ణవ్ రైల్వే అధికారులను కోరారు. ఇండియా ఏఐ మిషన్‌తో భాగస్వామ్యంతో, సీసీటీవీ కెమెరాల ద్వారా సేకరించిన డేటాపై కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని అన్వేషించాలని రైల్వే మంత్రి అధికారులను ప్రోత్సహించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 14 జులై 2025

## కాస్మోపాలిటన్ కాలనీ లో పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ప్రజావినికిడి ,(ఎల్బీనగర్):** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కాస్మోపాలిటన్ కాలనీ లో నూతనంగా నిర్మించిన పార్కును ప్రారంభించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి..అనంతరం సుధీర్ రెడ్డి అట్టి పార్క్ ఆవరణలో దాదాపు అయిదు సంవత్సరాల క్రితం వారు మంజూరు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు పరీక్షించడం జరిగింది.ఇప్పటికి చెక్కు చెదరకుండ ఉన్నాయని ప్రస్తుతం పార్కుల్లో నిర్మించే ఓపెన్ జిమ్ పరికరాలు నాసిరకంగా ఉంటూ కొన్ని రోజులకే విరిగిపోతున్నాయి అని అన్నారు.అనంతరం పక్కనే ఉన్న అసోసియేషన్ స్థలంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ,ఇట్టి విశాలమైన స్థలంలో అప్పట్లోనే కమ్యూనిటి హాల్ ఆటస్థలం కోసం ప్రతిపాదనలు పంపడం జరిగింది అని గుర్తు చేశారు.అలాగే రాబోయే తరాలను దృష్టికి పెట్టుకుని మాన్సూరాబాద్ రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్,టంగుటూరి నాగరాజు,యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి,భాస్కర్ రెడ్డి,భాస్కర్ యాదవ్ కాలనీవాసులు రుద్ర లక్ష్మీ నర్సింహా,శ్రీకాంత్,శ్రీనివాస్,సత్తయ్య, భాస్కర్, రమేష్, గోపాల్,జ్ఞానేశ్వర్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ ని ఘనంగా సన్మానించిన లక్ష్మీ ప్రియా కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు..!



**ప్రజావినికిడి,(హయత్ నగర్):**హయత్ నగర్ డివిజన్లోని లక్ష్మీ ప్రియా కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణానికి నిధులు మంజూరైన సందర్భంగా కాలనీవాసులు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని వారి నివాసంలో ఘనంగాసన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో మిగిలి ఉన్న వీధుల్లో కూడా భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ కు విజ్ఞప్తి చేయడంతో, కార్పొరేటర్ స్పందించి సంబంధిత అధికారులతో సమీక్షించి వీలైనంత త్వరగా లక్ష్మీ ప్రియా కాలనీలో పూర్తిస్థాయిలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని వారు కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మధుసూదన్,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శ్రీధర్ గౌడ్, నిరంజన్ యాదవ్, మధుకర్ రెడ్డి, అచ్చిరెడ్డి,ఉపేందర్, తాతారావు,శ్రీనివాస్ రెడ్డి,చంద్రశేఖర్, రాములు, మణికుమార్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి బోనాల పండుగలో పాల్గొన్న కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**ఆదివారం రోజు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మహాలక్ష్మి నగర్ కాలనీ శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ,కాలనీ వాసులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలంగాణ సంస్కృ తి, సంప్రదాయాలను తెలిపే బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు యాదయ్య, శ్రీనివాస కాలనీ అధ్యక్షులు చిత్రంజన్,సౌభాగ నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు నందకిషోర్,శాంతివనం అధ్యక్షులు స్వామి , కాలనీ సభ్యులు రాకేష్,రాజు, ఉపేందర్,హరి, సురేష్,సుధీర్ రెడ్డి, రవీందర్,యశోద్ద కృష్ణ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన కురుమ సంఘం నాయకులు..



**ప్రజావినికిడి,(గట్టుప్పల):జులై13,**గట్టుప్పల మండల కేంద్రం లో కురుమ సంఘం భావన నిర్మాణ ఏర్పాటు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఐదు లక్షలు మంజూరు చేసినట్లు కురుమ సంఘం అధ్యక్షుడు కుండే సత్తయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ కురుమ సంఘం భవన నిర్మాణానికి డిసిసి ఉపాధ్యక్షుడు దండు యాదగిరి రెడ్డి సహకారంతో ఐదు లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి శనివారం కురుమ సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కుండే సత్తయ్య,ప్రధాన కార్యదర్శి మందుల శశంకరయ్య,కోశాధికారి కుండే సత్తయ్య, మాజీ వార్డు మెంబర్ బండారు వెంకటేశం,కుండే శ్రీషేలం,కుండే మల్లయ్య,బాలాజీ,కుండే రాజు,మందుల గణేష్,కుండే రమేష్, కుండే లింగుస్వామి, కుండే బాలయ్య,మందుల నర్సింహా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్లకు వేములనర్వలో ఇంటి స్థలాల పంపిణీ..

**ముఖ్య అతిథులుగా హాజరైన కేశంపేట మాజీ జెడ్పీటీసీ శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి,ప్రముఖ సినీ నటుడు అలీ..**







**ప్రజావినికిడి,(షాద్ నగర్):** తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేశంపేట మండలం, వేములనర్వ గ్రామ శివారులో సినీ ఆర్ట్ డైరెక్టర్లకు ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేశంపేట మాజీ జెడ్పీటీసీ శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి,ప్రముఖ సినీ నటుడు అలీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ,సినీ రంగంలో కళాకారుల కృషి, ప్రతిభ ఎనలేనివని కొనియాడారు.వారికి ఇంటి స్థలాలు లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు అలీతో పాటు పలువురు సినీ డైరెక్టర్లు,నటులు పాల్గొన్నారు.ఈ స్థలాల పంపిణీతో ఆర్ట్ డైరెక్టర్ల దీర్ఘకాలిక స్వప్నం నెరవేరిందని, ఇది వారి కుటుంబాలకు భద్రతను చేకూరుస్తుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

## షాద్ నగర్ పట్టణం ఈశ్వర్ కాలనీలో అంగరంగ వైభవంగా వరాల పోచమ్మ తల్లి బోనాలు..

**పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందె బాబయ్య..**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** షాద్ నగర్ పట్టణం ఈశ్వర్ కాలనీ లో అంగరంగ వైభవంగ జరిగిన వరాల పోచమ్మ తల్లి బోనాల వేడుకలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందె బాబయ్యలు పాల్గొని,అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో మల్చలం మురళి,ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేడిగ పెంటయ్య,రమేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,హిందూ పండుగలలో ప్రత్యేక మైన పండుగ బోనాలు అని అన్నారు.హిందు ధర్మ రక్షణ కోసం యువత పాటు పడాలని సూచించారు.అమ్మవారి ఆశీస్సులు షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమం లో శ్రీశైలం,భాస్కర్, మోహన్ రెడ్డి అదేవిదంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలు - మహాత్మా చరక అవార్డులు..







**ప్రజావినికిడి,(హైదరాబాద్):జులై13,** గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ 50వ వార్షికోత్సవ స్వర్ణోత్సవ వేడుకలు నేడు గాంధీ భవన్లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మానసిక ఆరోగ్యం,పర్యావరణ సేవా రంగాల్లో అసాధారణ కృషికి గాను డా. మార్కండేయులు కు డా.నౌముల వెంకటేశ్వర్లు కు"మహాత్మా చరక అవార్డులు" ప్రదానం చేశారు.ఈ అవార్డులను గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ అధ్యక్షులు శ్రీ గున్న రాజేందర్ రెడ్డి మరియు ప్రసిద్ధ సామాజిక సేవకులు డా.పారికిరిపండ్ల అశోక్ ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఈసిజి ఫౌండేషన్ సభ్యులు పవిత్రమైన తులసి మొక్కలు ఇతర మొక్కలను ఆహూతులకు పంపిణీ చేశారు.పచ్చదనం కోసం అవగాహన కల్పించారు.ఇందులో నాగోలేలోని శివప్రియ క్లినిక్ ఇన్నర్ బ్లూమ్ కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బందికి వారి సేవలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.గాంధీజీ సిద్ధాంతాలను ప్రతిఫలించే ఈ వేడుకలో సేవా భావన, పర్యావరణ పరిరక్షణ, మానవతా విలువలు ప్రతిధ్వనించాయి.

## రాష్ట్రంలో బీసీల రాజకీయ శకం

**42 శాతం రిజర్వేషన్లకు అడ్డొస్తే సహించం: జాజుల -భద్రాచలంలో బీసీల సమర శంఖారావం సభ**



భద్రాచలం, జూలై 13 : రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీల రాజకీయ శకం ఆరంభమైందని.. రాబోయేది బీసీ రాజ్యమేనని, దాన్ని ఇక ఎవరూ ఆపలేరని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం భద్రాచలంలో జరిగిన బీసీల సమర శంఖారావం సభకు హాజరైన ఆయన మాట్లాడారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదని, 60 మంది ఎమ్మెల్యేలు ఉండాల్సిన చోట 18 మంది కూడా లేకపోవడం, అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఒక్క బీసీ ఎమ్మెల్యే, ఎంపీ కూడా లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా దక్కేంత వరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజకీయ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీల రిజర్వేషన్‌కు ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతామని హెచ్చరించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. బీసీలకు తాను అండగా ఉంటానని, రాజకీయ ఎదుగుదలకు సహకరిస్తానన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# తీర్మానం మల్లన్న పై దాడి ఖండిస్తున్నాం: టీజేఎస్ఎస్

**తెలంగాణ జాగృతి అధ్యక్షులుగా బీసీ అభ్యర్థి పేరు ప్రకటించగలరా.?**

**రాజకీయ లబ్ధి కోసమే బీసీ వాదం ఎత్తుకున్న కవిత..**

**బీఆర్ఎస్ పార్టీ ఇంటి పోరు పడలేకనే తెలంగాణ జాగృతి ఓవరాక్షన్..**

**అధికారంలో ఉన్నప్పుడు బీసీలు కనపడలేదా.? ఇప్పుడు ఉత్తిత్తి ప్రేమ ఎందుకు.?**

**తీన్మార్ మల్లన్న సామెతలలో తప్పేముంది.. సామెతలను కూడా తప్పుపట్టే సంస్కారం మీది..**

**అధికారంలో ఉన్న లేకున్నా బీఆర్ఎస్ చేస్తున్న దాడులు బీహార్ మూలాలకు కారణమా.?**

**ప్రజావినికిడి,(హైదరాబాద్):** ప్రశ్నించే గొంతుకులను అణిచివేయాలని గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఎంతోమంది జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టిందని,పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు జర్నలిస్టులు,బీసీ కుల సంఘాలు,బీసీ వాదం ఎక్కడా మాట్లాడని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పుడు బీసీ వాదంతో బీసీలకు న్యాయం చేస్తానని 42% బీసీ రిజర్వేషన్ అమలుకై పోరాడుతున్నానని కల్లబొల్లి మాటలు చెబుతూ తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకుంటూ బీసీ వాదాన్ని ముందుకేసుకుని తన రాజకీయ లబ్ధి కోసం పరుగులు పెడుతుందని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు.తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారని తన గుండాలతో తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ ఆఫీస్ పై దాడి చేయడం అమానుషమని, మల్లన్న తప్పుగా మాట్లాడితే చట్టపరమైన చర్య తీసుకోవాలని ముఖ్యమంత్రికి శాసనమండలిలో, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి తప్ప తన అనుచరుల పేరుతో గుండాలను ఏర్పాటుచేసివి మల్లన్న పై దాడి చేపించడం అమానుషమని ఈ దాడిని టిజేఎస్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలుగా బీసీ బిడ్డను కల్వకుంట్ల కవిత ప్రకటిస్తుందా.? అని ఈ సందర్భంగా అన్నారు.బీసీ వాదాన్ని ముందుకు తీసుకెళుతున్న తీన్మార్ మల్లన్న కు బీసీల నుండి భారీగా మద్దతు వస్తుందని ఓర్వలేక కవిత చిల్లర రాజకీయాలు చేయడం జరుగుతుందన్నారు. బీసీలకు తెలంగాణ జాగృతిలో అధ్యక్ష స్థానాన్ని కల్పిస్తుందా.? తన రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ పార్టీలో ఇంటి పోరు పడలేక బిఆర్ఎస్ నుండి అనధికారికంగా వెల్లగొట్టారని దానితో తెలంగాణ జాగృతి పేరుతో ప్రజలతో మమేకమై తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవాలని చూస్తున్న కల్వకుంట్ల కవిత పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు తమ ప్రభుత్వం ఏమి న్యాయం చేసిందని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ ప్రశ్నిస్తోంది.ప్రశ్నించే గొంతుకలను అనచివేయడం ఎవరి తరం కాదని,తప్పు చేసిన వారిని ప్రజలు తప్పకుండా శిక్షిస్తారని, దౌర్జన్యాలతో భయభ్రాంతులను చేసి అంచివేయాలని చూస్తే ఎవరు చూస్తూ ఊరుకోరని తప్పు ఎవరు చేసినా పార్టీలకు అతీతంగా టీజేఎస్ఎస్ ఖండిస్తదని ఈ సందర్భంగా అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ ఉద్యమ సమయంలో ఎస్సీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తానని ప్రకటించి అధికారం చేపట్టాక బడుగు బలహీన వర్గాలను దూరం పెట్టలేదా అని ఈ సందర్భంగా అన్నారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తీన్మార్ మల్లన్న కార్యాలయం పై దాడులు చేయడం అధికారం పోయిన తర్వాత కూడా దాడులు చేయడం చూస్తుంటే బీఆర్ఎస్ నేతలకు బీహార్ మూలాలు ఇంకా రక్తంలో ఉన్నాయా అన్నారు.అధికారంలో ఉన్నప్పుడు కనిపియ్యని మీ పార్టీ అధ్యక్షునికి ఎమ్మెల్సీ కవితకు ఇప్పుడు బీసీ బిడ్డలు కనిపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దమ్ముంటే ముందుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బడుగు బలహీన వర్గాలను ప్రకటించమని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇకపై ప్రశ్నించే గొంతుకలు జర్నలిస్టులపై ఎవరు దాడి చేసిన తప్పుడు కేసులు పెట్టిన బడుగు బలహీన వర్గాల బిడ్డలు చూస్తూ ఊరుకోరని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ నేతలు తెలిపారు.

# రజక అభివృద్ధి సంస్థ అబ్దుల్లాపూర్మెట్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

## మండల అధ్యక్షులుగా అవుతాపురం జయందర్ ఎన్నిక..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):జూలై13,** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక అభివృద్ధి సంస్థ నాయకులు డిమాండ్ చేశారు.రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం రజక సంఘం నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు.నూతన మండల అధ్యక్షులుగా అవతపురం జయేందర్,ప్రధాన కార్యదర్శిగా భాస్కర్ఉపాధ్యక్షుడిగా బండారి బాలయ్య, కోశాధికారిగా రాచమల్ల పోశయ్య, కార్యదర్శిగా గండి పెల్లి శివ ఎన్నికయ్యారు. గత ప్రభుత్వాలు రజకుల సామాజిక వర్గాన్ని విస్మరించాయని రజక సంఘం నాయకులు శ్రీరాములు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రజక ఫెడరేషన్ చైర్మన్ ను ఏర్పాటు చేసి 1000 కోట్లు నిధులు ఇచ్చి రజక అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో రజక భవన నిర్మాణానికి 25 లక్షల రూపాయలతో భవన నిర్మాణాన్ని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు రజక అభివృద్ధి సంస్థ హైదరాబాద్ చైర్మన్ ఎం నరసింహ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండలపు గాంధీ, రాష్ట్ర నాయకులు అవతపురం శ్రీరాములు,జిల్లా అధ్యక్షులు ముదిగొండ అజయ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు వేముల చంద్రశేఖర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు రజక అభివృద్ధి సంస్థ హైదరాబాద్ చైర్మన్ ఎం నరసింహ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండలపు గాంధీ, రాష్ట్ర నాయకులు అవతపురం శ్రీరాములు,జిల్లా అధ్యక్షులు ముదిగొండ అజయ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు వేముల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# జయప్రకాష్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా సముద్రాల సుధాకర్ ఎన్నిక..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):జూలై13,** అబ్దుల్లాపూర్మెట్ మండలం కుంట్లూరు జయప్రకాష్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం నాడు కాలనిలో నిర్వహించారు.ఈ అధ్యక్ష ఎన్నికల్లో సముద్రాల సుధాకర్ 18 ఓట్ల మెజారిటీతో గెలిచారు.253 మొత్తం ఓట్లుండగా 245 ఓట్లు పోలింగ్ అయ్యాయి.తన విజయానికి సహకరించిన కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేస్తానని తెలిపారు. కాలనీలో ఉన్న రోడ్లు, కరెంటు,విద్యుత్ దీపాలు,డ్రైనేజీ సమస్యలు జయప్రకాష్ నగర్ నుండి హయత్ నగర్ వరకు బస్సు సౌకర్యం ఇవన్నీ సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. గతంలో కాలనీ నుండి బస్సు సౌకర్యం ఉండేదని ప్రస్తుతం ఆబస్సు సౌకర్యాన్ని రద్దు చేయడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

# సిగాచి ఘటనపై అధికార వ్యవస్థకు ఎలాంటి అవగాహన లేదన్నారు

## సీనియర్ సైంటిస్ట్ బాబురావు






**ప్రజావినికిడి,(సంగారెడ్డి):** సంగారెడ్డి జిల్లా పాశం మైలారం సిగాచి పరిశ్రమను తెలంగాణ పౌర సమాజం నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు పరిశీలించారు తెలంగాణ జాయింట్ ఆక్షన్ కమిటీ మానవ హక్కుల వేదిక ఏపీ సి ఆర్ సంస్థ సైంటిస్ట్ వార్ పీపుల్ సంస్థలతో కలిసి పౌర సమాజం నిర్ధారణ కమిటీగా ఏర్పడి సిగాచిపరిశ్రమను పరిశీలించారు ఈ సందర్భంగా సీనియర్ సైంటిస్ట్ బాబురావు మాట్లాడుతూ సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం రసాయనాలకు సంబంధించినది కాదని ధూళి పేలుడుకు సంబంధించినది అన్నారు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కమిటీల పేరుతో సీనియర్ ఐఏఎస్ లను నియమిస్తారు మంచి అడ్మినిస్ట్రేటివ్ కావచ్చు కానీ ఇలాంటి వాటిపై వారికి నాలెడ్జ్ ఉండదన్నారు శివాజీ పరిశ్రమలో ప్రమాదాలు జరగకుండా ముందుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే వాటిపై అధికార సవ్యస్థకు ఎలాంటి అవగాహన లేదన్నారు నీయమ్మ నిబంధనలను పగడ్బందీగా అమలు చేసే చట్టాలను రూపొందించాలన్నారు.

# సిగాచి దుర్ఘటన మరువక ముందే పాష మైలారం పరిశ్రమక వాడలో మరో కంపెనీలో అగ్నిప్రమాదం





**ప్రజావినికిడి,(పటాన్చెరువు):** పటాన్చెరువు పాషా మైలారం పరిశ్రమ కా వాడలో ఉదయం మరో అగ్ని ప్రమాదం జరిగింది ఎన్విరో వేస్ట్ మేనేజ్మెంట్ పరిశ్రమలో మంటలు ఎగిసిపడ్డాయి ఫార్మా ఆసుపత్రుల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిలింగ్ చేస్తున్న పరిశ్రమల్లో అకస్మాత్తుగా మంటలు చెల్లరేగాయి దట్టమైన పొగలు కక్కుతున్న మంటలను ఆర్పేందుకు నాలుగు ఫైర్ ఇంజన్లను సహాయంతో అదుపులోకి తీసుకువచ్చారు.ఈ సంఘటనలో ఒక లారీ దగ్ధమవడం మినహా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అగ్నిమాపక జిల్లా అధికారి నాగేశ్వరరావు చెబుతున్నారు అయితే శివాజీ పరిశ్రమలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం సంఘటన మరిచిపోకముందే ఎన్విరో వేస్ట్ మేనేజ్మెంట్ పరిశ్రమ దగ్ధమవడం చర్చ నిశ్చయంగా మారింది పరిశ్రమలలో ఫైర్ సేఫ్టీ కర్మగార యాజమాన్య భాద్యతలు కార్మికుల రక్షణ వంటి అంశాలపై పరిశ్రమల శాఖ అధికారులు ప్రభుత్వం అవలంబించే విధానాలను కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి..



# మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి..

ప్రజావినికిడి,(తుక్కుగూడ): మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ,మంకాళ, ఇమామ్గూడ తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించబడిన మహంకాళి అమ్మవారి బోనాల జాతరల్లో పాల్గొన్న మహేశ్వరం ఎమ్మెల్యే,మాజీ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి భక్తులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్థానికులతో మమేకమై సంబరాల్లో పాల్గొన్న ఆమె,తెలంగాణ సాంస్కృతిక విలువలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు.



# కేశంపేట మండలం వేములనర్వ గ్రామ పరిధిలో తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఇంటి స్థలాల పంపిణీ

## కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబాయ్య




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలో కేశంపేట మండలం వేముల నర్వ గ్రామంలో తెలుగు సినీ ఆర్ట్స్ డైరెక్టర్ అసోసియేషన్స్ ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న షాద్ నగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందే బాబయ్య,రొల్లు రఘురాం గౌడ్,మోటె శ్రీనివాస్,పులిజాల శ్రీనివాస,వెంకటేశ్వర్ జి,తుమ్మల చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.అందె బాబయ్య మాట్లాడుతూ సముద్ర మట్టానికి షాద్ నగర్ ప్రాంతం ఎంతో ఎత్తులో ఉంటుందనీ ఈ ప్రాంతంలో ప్లాటు తీసుకోవడం ఇక్కడ వాతావరణం చాలా బాగుంటుందని అదేవిధంగా జూపార్కులు కూడా ఇక్కడ తరలిస్తున్నారు కాబట్టి అతి త్వరలో ఇక్కడ అద్భుతమైన డెవలప్మెంట్ జరుగుతుందని సినీ ఫీల్డ్ వాళ్లు ఇక్కడ ప్లాట్లు తీసుకోవడం చాలా సంతోషకరమైన విషయం మీ ద్వారా కూడా కొంత అభివృద్ధి జరగాలని వారికి విజ్ఞప్తి చేస్తూ ఫ్లాట్ ఓనర్లకు డాక్యుమెంట్స్ ప్రధానం చేయడం జరిగింది.తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బాబయ్య గారు బహుమతి ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఇతర పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# యుద్ధప్రాతిపదికన పాలేరు సాగర్ యూటీ పనులు పూర్తి

## నేడు నీటిని విడుదల చేయనున్న మంత్రి పొంగులేటి..







**ప్రజావినికిడి,(హైదరాబాద్):**ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే పాలేరులోని నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ (యూటీ)నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రేపటి (సోమవారం)నుంచి 1500క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆదివారం నాడు ఆయన కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో జరుగుతున్న పాలేరు సాగర్ కాలువ పనులను ఆకస్మికంగా జిల్లా కలెక్టరు అనుదీప్ దురిశెట్టి తో కలిసి తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు సెప్టెంబర్‌లో పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం జుజ్జులరావు పేట సమీపంలో పాలేరు రిజర్వాయర్ దగ్గర ప్రధాన కాలువపై అండర్ టన్నెల్ (యూటీ) కొట్టుకపోయిందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో అప్పట్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసి సాగునీటిని అందించడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో యూటీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన రూ 14.20 కోట్లతో ఈ యూటీ కాలువ మరమ్మతులను ప్రారంభించడం జరిగిందని ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగానికి జీవనాధారమైన ఈ కాలువ మరమ్మతులను పూర్తిచేసి సాగునీరు అందిస్తాం. దీనివలన ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఒక్క పాలేరు నియోజకవర్గంలో 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యంత ప్రాధాన్యతా క్రమంలో రోజు కు రెండు షిఫ్ట్‌ల క్రమంలో పనిచేసి గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు.

# కేంద్ర మంత్రిని కలిసిన తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పరా ప్రసాద్..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** కప్పర ప్రసాద్ రావు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై జనం సమస్యలపై జర్నలిస్టులు ప్రజల్లోకి తీసుకువెళ్లేవారికి న్యాయం చేయాలని కోరారు కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా నిలిచి రైల్వే పాసులు టోల్ ట్యాక్స్ ఫ్రీ చేసి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు రాష్ట్రంలో జర్నలిస్టులకు రావాల్సిన ఇళ్ల స్థలాలు హెల్త్ కార్డులు కోసం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# నేటి నుంచి రేషన్ కార్డుల పంపిణీ



హైదరాబాద్:**జులై 13 ప్రజావినికిడి** పేదలకు ఆహార భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులను నిరంతరం అం దించే ప్రక్రియ ద్వారా ఎప్పటికప్పుడు కొత్త రేషన్ కార్డుల మం జూరుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో జరిగే బహిరంగ సభలో శ్రీకారం చుట్టనున్నారు. పౌర సరఫరాల మంత్రి ఉత్త మ్ కుమార్‌రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3,58,187 కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దీంతో అదనంగా 15,53,074 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనున్నది. మొదటి దశలో సిఎం రేవంత్ రెడ్డి 2,03,156 కొత్త కార్డులు మంజూరు కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లాలో ప్రారంభించిన విషయం తెలిసిందే. తుంగతుర్తి సభలో కొత్త రేషన్ కార్డుల జారీతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 89,95,282 నుంచి 95,56,625 కు చేరుకుంటుంది. లబ్ధిదారుల సంఖ్య 2,81,47,565 మంది నుంచి 3,09,30,911 మంది వరకు పెరుగుతుంది

## రాష్ట్రంలో రెండు రోజుల పాటు వర్షాలు

**జులై 13 ప్రజావినికిడి**
వర్షాల కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త చెప్పింది. ఈశాన్య బంగాళా ఖాతంలో ఉపరితల ద్రోణి ఏర్పడిందని, దీని కారణంగా రాష్ట్రమంతా నైరుతి రుతుపవనాలు విస్తరించి రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# నూతన కమిటీ నా... మజాకా

## సీఎస్కే విల్లాస్ లో ఘనంగా బోనాల సంబరాలు.. -అలరించిన పోతురాజుల విన్యాసాలు..

**ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు.. ఆటపాటలతో ధూమ్ ధామ్ లు..**

**బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నూతన కమిటీ ప్రెసిడెంట్ బంటారం మహేష్ గౌడ్,అధ్యక్షులు అరటి యాదయ్య, ఉపాధ్యక్షుడు ఇంజమూరి గోపాల్, పోలపల్లి రమేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్..**

**బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహిళ కమిటీ సభ్యులు మ్యాన అరుణ, అరటి విజయలక్ష్మి, అరుణ,నాగ హరిత, వట్టికూటి విజయలక్ష్మి,రూప తదితరులు**






**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
స్థానిక మున్సిపల్ పరిధిలో సీఎస్కే విలాస్ లో బోనాల ఉత్సవాలు అంబరాన్ని అంటాయి. నూతనంగా ఎన్నికైన సీఎస్కే విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని సీఎస్కే విల్లాస్ లోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బోనాల సంబరాలను అంబురాన్ని అంటించి బోనాన్ని నెత్తిన ఎత్తుకొని,ఆషాడ మాస బోనాల శుభ సందర్భాన్ని పురస్కరించుకుని సీఎస్కే విల్లాస్ లోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బోనాన్ని నెత్తిన ఎత్తుకొని అమ్మ ఎల్లమ్మ తల్లి మా కుటుంబాలను రక్షించమ్మా అని వేడుకుంటూ కరెంటు ఆఫీస్ ఎదురుగా ఉన్న పోచమ్మ తల్లి దేవాలయానికి చేరుకొని బోనాన్ని సమర్పించి తమ మొక్కులను నెరవేర్చమని పోచమ్మ తల్లిని ప్రార్థించారు. బోనాల సందర్భాన్ని పురస్కరించుకొని గౌరవ అధ్యక్షులు అరటి యాదయ్య ఇంటిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి అందరికీ భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మలగను నా యమ్మ తల్లి దయ అందరిపై ఉండాలని నూతన కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. బోనాల శుభ సందర్భంగా పురస్కరించుకొని కమిటీ అధ్యక్షుడు బంటారం మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన స్వగృహం నుంచి బయలుదేరిన బోనాల జాతర ఉత్సవం కాలనీలోని అందరిని కలుపుకుంటూ పోతూ పోచమ్మ దేవాలయం వరకు జాతరగా సాగింది. ఈ కార్యక్రమంలో మహిళలు ఉల్లాహంగా ఉత్సాహంగా, సంతోషంగా సాగుతున్న జాతర కార్యక్రమంలో తమనృత్య ప్రదర్శనతో అందరినీ అలరించారు. అనంతరము సీఎస్కే విల్లాస్కు చేరుకున్న కాలనీ సభ్యులు, నూతన కమిటీ సభ్యులు గౌరవ అధ్యక్షుడు అరటి యాదయ్య ఏర్పాటు చేసిన సామూహిక విందు కార్యక్రమంలో పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ బోనాల కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అరటి యాదయ్య తో పాటు సీఎస్కే వెల్లిపోయారు అసోసియేషన్ అధ్యక్షుడు బంటారాం మహేష్ గౌడ్, ఉపాధ్యక్షులు ఇంజమూరి గోపాల్, పోలేపల్లి రమేష్ గౌడ్, కోశాధికారి మ్యాన బాలకృష్ణ,ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షురాలు మ్యాన అరుణ, భూషణ్ భాగ్యలక్ష్మి, దీపిక,సహాయ కార్యదర్శి అరటి విజయలక్ష్మి,వట్టికూట విజయలక్ష్మి, రూప,సునీత, అలివేలు, సుప్రియ,రాణి,లత, అరుణ,కవిత,విద్య, నాగిళ్ల ప్రమీల,అరుణ, నాగమణి,లావణ్య, దిద్ది లత,లక్ష్మి,ప్రభ, ఇంజమూరి వసంత, సరస్వతి,సిద్దుల అరుణ,మనోహరి, తదితరులు పాల్గొని బోనాల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి

## పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సూచన

### నేడు నల్గొండ, రేపు సూర్యాపేట జిల్లాల్లో పర్యటన

**రాంనగర్/హైదరాబాద్, జూలై 13:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సూచించారు. బీజేపీ సిద్ధాంతాలు, మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఆదివారం బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాంచందర్‌రావును ఆయన నివాసంలో శాలువాకప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. కాగా, ఆయన సోమవారం నుంచి రెండు రోజులపాటు నల్గొండ, సూర్యాపేట



జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు నల్గొండలో వివిధ సంఘాలు, న్యాయవాదులు, వైద్యులతో, అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. మధ్యా హ్నం 3.30 గంటలకు సూర్యాపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అక్కడ పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. రాత్రికి ఆయన స్వగ్రామం కోదాడ నియోజకవర్గంలోని నల్లబండగూడెంలో బస చేస్తారు. మంగళవారం అక్కడ రైతులతో సమావేశమవుతారు. ఉదయం 10 గంటలకు కోదాడలో రైతులతో, మధ్యాహ్నం 1.30గంటలకు చౌటుప్పల్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించే సమావేశాల్లో పాల్గొంటారు.

# కాళేశ్వరాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే మూడు రోజుల్లో సాగునీరు

## మాజీ మంత్రిజగదీశ్ రెడ్డి



**గోదావరిఖని, జూలై 13 :** "కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ చేతకాని రేవంత్ సర్కార్.. రైతాంగానికి నీళ్లు ఇవ్వలేకపోతున్నది. ప్రాజెక్టు నిర్వహణను కేసీఆర్‌కు అప్పగిస్తే మూడు రోజుల్లో ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చి చూపిస్తారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు సాగి సుభిక్షంగా ఉంటే.. రేవంత్ పాలనలో రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోంది" అని మాజీ మంత్రి జగద్వీర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

# అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు

**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో మోతాదుకు మించి ఉప్పు వినియోగం ఉంటోందని, దీని ప్రతికూల ఫలితాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయని తాజా అధ్యయనం పేర్కొంది. హైపర్‌టెన్షన్, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారిలో ముప్పు మరింత పెంచుతోందని ఐసీఎంఆర్‌కు చెందిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమిడమాలజీ' శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఉప్పు వినియోగం తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అధ్యయనం చేయడంతో పాటు తక్కువ సోడియం ఉన్న ప్రత్యామ్నాయ ఉప్పుపై దృష్టి సారిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం.. ఓ వ్యక్తి రోజులో 5గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. కానీ, భారత్‌లో పట్టణ ప్రాంతాల ప్రజలు రోజుకు 9.2 గ్రాములు తీసుకుంటుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ వినియోగం 5.6 గ్రాములుగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.



**సోడియానికి బదులు..**

ఉప్పులోని సోడియం క్లోరైడ్‌లో కొంతభాగాన్ని పొటాషియం లేదా మెగ్నీషియం లవణాలతో భర్తీ చేయడం ఆశాజనకంగా కనిపిస్తోందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఎన్‌ఐఈ సీనియర్ శాస్త్రవేత్త డా.శరణ్ మురళి పేర్కొన్నారు. సోడియం తక్కువ తీసుకోవడం.. రక్తపోటును తగ్గించడంతో పాటు గుండె పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. ముఖ్యంగా హైపర్‌టెన్షన్‌తో బాధపడేవారికి ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. రక్తపోటు దాదాపు 7/4 ఎంఎంహెచ్‌జీ తగ్గుతుందని.. ఈ చిన్న మార్పు చాలా పెద్ద ప్రభావం చూపుతుందన్నారు.

**అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు**

ఐసీఎంఆర్ సాయంతో తెలంగాణ, పంజాబ్‌లలో మూడేళ్ల వ్యవధితో కూడిన అధ్యయనాన్ని ఎన్‌ఐఈ ప్రారంభించింది. రక్తపోటు ఉన్న వ్యక్తుల్లో ఉప్పు తగ్గింపు ప్రభావాన్ని అంచనా వేయడం, దీనిపై కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి లక్ష్యాలతో దీన్ని చేపట్టినట్లు డా.గణేశ్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం అధ్యయనం తొలి ఏడాదిలో ఉందని, క్షేత్రస్థాయి సన్నద్ధత, అంచనాలపై పనిచేస్తున్నామని చెప్పారు. దీనిపై గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలతో కలసి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

**లభ్యత తక్కువే..**

మార్కెట్‌లో తక్కువ సోడియం ఉప్పు లభ్యత? ధర ఎలా ఉందనే దానిపై చెన్నైలో 300 రిటైల్ దుకాణాల్లో ఎన్‌ఐఈ సర్వే చేపట్టింది. 28శాతం రిటైల్ దుకాణాల్లో, 52 శాతం సూపర్ మార్కెట్లలో లభ్యమవుతుండగా.. కేవలం 4శాతం చిన్న కిరాణా దుకాణాల్లోనే ఇది అందుబాటులో ఉన్నట్లు తేలింది. అంతేకాదు, సాధారణ ఉప్పు ధర 100గ్రాములకు రూ.2.7 ఉండగా.. ఎల్ఎస్ఎస్ ధర రూ.5.6గా ఉందని వెల్లడైంది. తక్కువ సోడియం కలిగిన ప్రత్యామ్నాయాలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు

# కాంగ్రెస్ కీలక సమావేశానికి సోనియా పిలుపు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజిక్ గ్రూప్ సమావేశం ఈనెల 15న జరుగనుంది. దీనికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షత వహించనున్నారు. సోనియాగాంధీ తన నివాసమైన 10, జన్‌పథ్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు పాల్గొనున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈసారి అధికార, విపక్షా పార్టీల మధ్య వాడివేడిగా జరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్



చేపట్టడంపై తీవ్ర ఆందోళన చేస్తున్న విపక్షాలు ఈ అంశాన్ని ఉభయసభల్లోనూ ప్రస్తావించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తరువాత జరుగుతున్న తొలి సమావేశాలు కావడంతో ఈ అంశాలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని కాంగ్రెస్ భావిస్తోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21న ప్రారంభమై ఆగస్టు 21తో ముగియనున్నాయి. తొలుత ఆగస్టు 12తో సమావేశాలు ముగుస్తాయని ప్రకటించినప్పటికీ ఆ తర్వాత మరో వారం రోజులు పొడిగించాలని ప్రభుత్వ నిర్ణయించింది. దీంతో లెజిస్లేటివ్ ఎజెండా ఎక్కువగానే ఉండచ్చని తెలుస్తోంది. ఆటమిక్ ఎనర్జీ రంగంలో ప్రైవేటురంగానికి మార్గం సుగమం చేసే కీలక చట్టాన్ని ఈ సమావేశాల్లో తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

## పాస్‌పోర్ట్, వీసా లేకుండానే విమానంలో సౌదీకి..

# ఎయిర్‌లైన్ కంపెనీకి ప్రయాణికుడి లీగల్ నోటీసులు!

పాక్‌లోని లాహెూర్‌కు చెందిన షాజాహాన్ అనే యువకుడు కరాచీ వెళ్లేందుకు విమానంలో బయలుదేరాడు. పొరపాటున సౌదీ అరేబియాలోని జెడ్డాకు చేరుకున్నారు. ఎయిర్‌లైన్స్ కంపెనీ నిర్లక్ష్యం కారణంగానే తాను జెడ్డా నగరానికి చేరుకోవాల్సి వచ్చిందని ఆరోపించాడు. టికెట్ చెక్ చేసిన సమయంలో ఎయిర్ హెూస్టెస్ తనను మరో విమానం ఎక్కే సమయంలో ఇంటర్నేషనల్ ఫ్లైట్ ఎక్కకుండా అడ్డుకోలేదని ఆరోపించాడు. డొమెస్టిక్ టెర్మినల్ వద్ద రెండు విమానాలు నిలిచి ఉన్నాయని.. తాను ఓ విమానానికి బదులుగా మరో విమానం ఎక్కినట్లు పేర్కొన్నారు. దాదాపు రెండుగంటల తర్వాత విమానం కరాచీకి చేరుకోకపోవడంతో సదరు ప్రయాణికుడు తన తప్పును తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది తనను నిందించారని సదరు వ్యక్తి పేర్కొన్నాడు. తనకు పాస్‌పోర్ట్ లేదని, వీసా లేకుండానే తాను సౌదీకి చేరానని చెప్పుకొచ్చాడు. ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్యం కారణంగా సౌదీలో తాను అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. ఆ దేశంలో ఎఫ్ఐఏ అధికారులు తనను విచారించారని.. తాను తిరిగి కరాచీకి చేరుకునేందుకు మూడురోజుల సమయం పట్టిందని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో షాజాహాన్ ఎయిర్‌లైన్స్‌కు లీగల్ నోటీసు పంపాడు. ఎయిర్‌లైన్ తప్పు కారణంగా తనకు మానసికంగా, ఆర్థికంగా నష్టం జరిగిందని తెలిపాడు. అదనపు ప్రయాణఖర్చులు, అసౌకర్యానికి పరిహారం చెల్లించాలని



డిమాండ్ చేశాడు. లాహెూర్ విమానాశ్రయం, పాకిస్తాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ దర్యాప్తు ప్రారంభించారు. చెకింగ్, బోర్డింగ్ ప్రక్రియలో ఎయిర్‌లైన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ సంఘటన ఒక వ్యక్తి ఇబ్బందులు పడడమే కాకుండా పాక్‌లో విమాన ప్రయాణ భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పాస్‌పోర్ట్, వీసా లేకుండా విదేశాలకు ఓ ప్రయాణికుడు చేరుకోవడం ప్రత్యక్షంగా నిబంధనలు ఉల్లంఘించడమే. అయితే, ఇప్పటి వరకు ఎయిర్‌లైన్స్ స్పందించలేదు.

# భారత్‌తో బంధంలో ఓ సమస్య..దలైలామా వారసుడి ఎంపిక

**ఢిల్లీ:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని..ఇందులో భారత్ కల్పించుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం. దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో టిబెట్ బౌద్ధగురువు దలైలామాకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల మాట్లాడుతూ..చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని పేర్కొన్నారు.అది భారత్‌లో కూడా కావచ్చని



వ్యాఖ్యానించారు. తన వారసత్వంపై నిర్ణయం తీసుకునే హక్కు చైనాకు లేదని స్పష్టం చేశారు. అనంతరం దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల దలైలామా పుట్టిన రోజు వేడుకలకు హాజరైన భారత కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ..15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టం చేశారు

## ఆర్పీఎఫ్ తొలి మహిళా సారథిగా సోనాలి మిశ్రా

**న్యూఢిల్లీ:** మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారు. భారత సైన్యంలోనూ ప్రవేశించి, తమ సత్తా చాటుతున్నారు. ఇప్పుడు సీనియర్ ఐపీఎస్ అధికారిణి సోనాలి మిశ్రా.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా నియమితు లయ్యారు. జూలై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ స్థానంలో ఆమె ఈ పదవిని చేపడుతున్నారు. సోనాలి మిశ్రాను ఈ పదవిలో నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ అధికారికంగా ఆమోదం తెలిపింది. సిబ్బంది మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 2026, అక్టోబర్ 31 వరకూ అంటే పదవీ విరమణ చేసే వరకు సోనాలి మిశ్రా ఈ పదవిలో కొనసాగనున్నారు. రైల్వే ఆస్తులను కాపాడటం, ప్రయాణికుల భద్రత తదితర విధులతో పాటు, వాటి బాధ్యతలను అధికారులకు అప్పగించే విషయంలో ఆర్పీఎఫ్‌కు సోనాలీ మిశ్రా తొలి మహిళా అధికారిగా విధులు నిర్వహించనున్నారు. సోనాలి మిశ్రా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1993 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారిణి. ఆమె ప్రస్తుతం మధ్యప్రదేశ్ పోలీసు విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ (సెలక్షన్)గా పనిచేస్తున్నారు. కాగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)1957లో పార్లమెంటు చట్టం ప్రకారం ఏర్పాటయ్యింది. దీనికి 1985, సెప్టెంబర్ 20న యూనియన్ సాయుధ దళం హెూదా ఇచ్చారు. 2021 జూలైలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఏర్పాటుకు నాయకత్వం వహించిన మొదటి మహిళా కమాండర్‌గా సోనాలి మిశ్రా పేరొందారు.




## కేరళ సీఎం నివాసానికి బాంబు బెదిరింపు!





కేరళ సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు తంపనూరు పోలీస్ స్టేషన్‌కు మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయని ఆ ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో సీఎం నివాసంలోని సెక్యూరిటీ సిబ్బంది పోలీసులు అప్రమత్తమయ్యారు. విస్తృతంగా తనిఖీలు చేసి అది ఫేక్ ఈ-మెయిల్‌గా తేల్చారు. బాంబు బెదిరింపు మెయిల్ రాగానే అధికారులు ముఖ్యమంత్రి నివాసాన్ని డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కానీ ఎలాంటి బాంబు జాడ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా తనిఖీల సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బెదిరింపు మెయిల్‌కు, తాజాగా వచ్చిన బెదిరింపు మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు. 2025-2030 మధ్య కాలంలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయిందన్నారు. గడిచిన ఐదేళ్లలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా.. దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు నీతీశ్ చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఈసారి రెట్టింపు ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. కేవలం ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేటు, ఇతర పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు నీతీశ్ పేర్కొన్నారు. "ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ప్రైవేటు రంగంలో మరో 39 లక్షల మందికి ఉపాధి కల్పించాం. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల హామీ దాదాపు నెరవేరినట్లే. ఇప్పుడు లక్ష్యాన్ని రెట్టింపు చేస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాం. ప్రధానంగా పారిశ్రామిక రంగాల్లో యువతకు ఉపాధి చూపిస్తాం" అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశముంది.

## ఇద్దరు పనికిరాని బీజేపీ డిప్యూటీ సీఎంలు ఏం చేస్తున్నారు..? : తేజస్వి యాదవ్

ప్రముఖ వ్యాపారి గోపాల్ ఖేమ్కా హత్య ఘటనను మరువకముందే బీహార్ రాజధాని పట్నాలో మరో వ్యక్తి హత్యకు గురికావడంపై.. ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ కీలక నేత తేజస్వి యాదవ్ స్పందించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా.. లేదా..? అని ప్రశ్నించారు. వరుస హత్యలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. 'వ్యాపారి గోపాల్ ఖేమ్కా హత్య ఘటనను మరువకముందే పట్నాలో ఇప్పుడు బీజేపీ నేత హత్యకు గురయ్యారు. దీనిపై ఏం చెప్తారు.. ఎవరికి చెప్తారు..? అసలు రాష్ట్రంలోని ఎన్డీఏ సర్కారులో ఏ ఒక్కరైనా నిజం తెలుసుకోవడానికి, తప్పులు ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారా..?' అని తేజస్వి ప్రశ్నించారు. సీఎం ఆరోగ్యం గురించి అందరికీ తెలుసని, కానీ ఇద్దరు పనికిరాని బీజేపీ డిప్యూటీ సీఎంలు ఏం చేస్తున్నారని మండిపడ్డారు.






## టీ20 ప్రపంచ కప్ టోర్నీకి
# ఇటలీ మొదటిసారిగా అర్హత

టీ20 క్రికెట్ పరిచయం తర్వాత ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ప్రజాదరణ పొందుతోంది. మూడు గంటల్లోనే మ్యాచ్ ఉత్సాహంగా ముగుస్తుంది. కాబట్టి అనేక యూరోపియన్ దేశాలు క్రికెట్ ఆడేందుకు ఆసక్తిని చూపుతున్నాయి. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న టీ20 ప్రపంచ కప్ టోర్నీకి ఇటలీ మొదటిసారిగా అర్హత సాధించింది. దీని ద్వారా ఇప్పటివరకు క్రికెట్ వైపు చూడని యూరోపియన్ దేశాలలో ఇటలీ అర్హత సాధించడం ఒక ప్రత్యేకత. టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ కోసం యూరోపియన్ ప్రాంతీయ క్వాలిఫయర్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో ఇటలీ, నెదర్లాండ్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఇటలీ నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యాన్ని నెదర్లాండ్స్ జట్టు 16.2 ఓవర్లలో ఛేదించింది. దీని ద్వారా నెదర్లాండ్స్ జట్టు టీ20 ప్రపంచ కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధించింది. నెదర్లాండ్స్ జట్టుపై ఇటలీ ఓడినప్పటికీ.. గ్రూప్‌లో 4 మ్యాచ్ లు ఆడిన ఇటలీ 2 విజయాలు, ఒక పరాజయం, ఒక ఫలితం తేలని మ్యాచ్‌తో 5 పాయింట్లు ఖాతాలో వేసుకుని పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలవడం ద్వారా ముందంజ వేసింది.పాయింట్ల పట్టికలో స్కాట్లాండ్ జట్టుతో పోలిస్తే అధిక రన్ రేట్ సాధించిన ఇటలీ జట్టు ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించింది. ఇదిలా ఉండగా.. గత 4 టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్లలో స్థానం సంపాదించిన స్కాట్లాండ్ జట్టు ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించకుండానే నిష్క్రమించింది. మొత్తం 20 జట్లు 2026 టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో ఆడనున్నాయి. ప్రస్తుతం వరకు 15 జట్లు అర్హత సాధించాయి. ఇంకా ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ టోర్నమెంట్ నుంచి 3 జట్లు, ఆఫ్రికా క్వాలిఫయర్ ద్వారా రెండు జట్లు ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించనున్నాయి.ఈ నేపథ్యంలో మాజీ ఆస్ట్రేలియా టెస్ట్ క్రికెట్ ఆటగాడు జో బర్న్స్ ప్రస్తుతం ఇటలీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గత టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ సమయంలో పాకిస్థాన్ అమెరికా జట్టుతో ఓడిపోయిన నేపథ్యంలో.. ప్రస్తుతం ఇటలీ జట్టు ప్రపంచ కప్ టీ20 టోర్నమెంట్‌లో ఆడనున్నందున పాకిస్తాన్ జట్టు జాగ్రత్తగా ఉండాలని భారత అభిమానులు సరదాగా కామెంట్లు చేస్తున్నారు.

# జో రూట్ ప్రపంచ రికార్డ్
## అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న జో రూట్



టెస్ట్ క్రికెట్ చరిత్రలో కేవలం నలుగురు ఆటగాళ్ళు మాత్రమే 200ం క్యాచ్‌లు తీసుకున్నారు. ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ ఇప్పుడు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. అది కూడా రాహుల్ ద్రవిడ్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి.. నంబర్ వన్‌గా నిలిచాడు.లార్డ్స్ వేదికగా భారత్ తో జరిగిన 3వ టెస్ట్ మ్యాచ్ లో జో రూట్ టీమిండియా బ్యాట్స్ మన్ కరుణ్ నాయర్ ను క్యాచ్ తో పట్టుకున్నాడు. ఈ క్యాచ్ తో టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్ లు పట్టిన ఫీల్డర్ గా జో రూట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ పేరిట ఉండేది. 301 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో ఫీల్డింగ్ చేసిన ద్రవిడ్ మొత్తం 210 క్యాచ్‌లు పట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు జో రూట్ ఈ రికార్డును బద్దలు కొట్టడంలో విజయం సాధించాడు. జో రూట్ ఇప్పటివరకు 156 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి, 296 ఇన్నింగ్స్‌లలో ఫీల్డింగ్ చేశాడు. ఈ సమయంలో, అతను తీసుకున్న క్యాచ్‌ల సంఖ్య సరిగ్గా 211ఌ. దీనితో, టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న ఫీల్డర్‌గా జో రూట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ప్రపంచ రికార్డు శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే పేరిట ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో 768 ఇన్నింగ్స్‌లలో (టీ20ంటెస్ట్ంవన్డే) ఫీల్డింగ్ చేసిన జయవర్ధనే మొత్తం 440 క్యాచ్‌లు పట్టడం ద్వారా ఈ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు.

# కపిల్ దేవ్‌ను దాటేసిన బుమ్రా



లార్డ్స్ టెస్ట్‌లో జస్ప్రీత్ బుమ్రా భారత ఫాస్ట్ బౌలర్లకు ఇప్పటివరకు కలలో కూడా సాధ్యం కాని దాన్ని నిజం చేశాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా రెండో టెస్ట్‌కు దూరంగా ఉన్న బుమ్రా, మూడో టెస్ట్ రెండో రోజు ఉదయం బంతి పట్టుకోగానే ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌లపై సునామీలా విరుచుకుపడ్డాడు. అతను ఈ ఇన్నింగ్స్ 5 వికెట్లు తీయడమే కాకుండా దిగ్గజ బౌలర్ కపిల్ దేవ్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.లార్డ్స్ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి, జస్ప్రీత్ బుమ్రా తన కెరీర్‌లో 15వ ఐదు వికెట్ల ఘనతను పూర్తి చేసుకున్నాడు. దీనిలో స్పెషాలిటీ ఏంటంటే.. ఇది విదేశీ గడ్డపై బుమ్రా 13సార్లు ఐదు వికెట్లు తీసిన ఘనతను సాధించాడు. దీంతో అతను కపిల్ దేవ్‌ను వెనక్కి నెట్టాడు. కపిల్ దేవ్ పేరు మీద 12 సార్లు ఐదు వికెట్లను తీసిన ఘనత సాధించిన రికార్డు ఉంది. ఇప్పుడు బుమ్రా విదేశీ గడ్డపై అత్యధిక సార్లు ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు.విదేశీ గడ్డపై అత్యధిక ఐదు వికెట్ల ఘనతలు సాధించిన వారిలో జస్ప్రీత్ బుమ్రా టాప్ ప్లేసులో ఉన్నాడు. బుమ్రా తర్వాతి స్థానంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ఉన్నాడు. అతను విదేశీ గడ్డపై 12 సార్లు ఐదు వికెట్లు తీశాడు. మూడో స్థానంలో భారత అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరైన అనిల్ కుంబ్లే నిలిచాడు.. తను 10 సార్లు ఈ ఫీట్‌ను నమోదు చేసుకున్నాడు. ఇక నాలుగో స్థానంలో టీమిండియా సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ ఉన్నాడు. అతను 9 సార్లు ఈ ఘనతను సాధించాడు.లార్డ్స్ మైదానంలో ఏదో ఒక రికార్డును తమ పేరు మీద నమోదు చేసుకోవాలని ప్రతి క్రికెటర్ కలలు కంటారు. కానీ బుమ్రా ఈ మైలురాయిని చేరుకున్న తర్వాత కూడా చాలా సైలెంటుగా కనిపించాడు. శుక్రవారం ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ సందర్భంగా తన స్పెల్‌లో జోఫ్రా ఆర్చర్‌ను అవుట్ చేసి అతను ఐదు వికెట్లు పూర్తి చేసుకున్నాడు. అది బుమ్రాకు ఆ ఉదయం లభించిన నాలుగో వికెట్. తన అద్భుతమైన బౌలింగ్ సాయంతో భారత్ ఇంగ్లాండ్‌ను 387 పరుగులకే కట్టడి చేసింది.రెండో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ 4 వికెట్ల నష్టానికి 251 పరుగులతో ముందుకు సాగింది. జామీ స్మిత్, బ్రైడాన్ కార్స్ హాఫ్ సెంచరీలు సాధించారు. అయితే, ఆ తర్వాత ఇంగ్లాండ్ జట్టు భారత బౌలర్ల ముందు తడబడింది.





# చనిపోతాడని అనుకోలేదు..
## సిరాజ్ ఎమోషనల్ కామెంట్స్!

%పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ డియోగో జోటా యాక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పోయాడని తెలిసి షాక్‌కు గురయ్యానని మహ్మద్ సిరాజ్ అన్నాడు. అతడి మరణం తనను కలచివేసిందని.. తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు టీమిండియా స్టార్ పేసర్ చెప్పాడు. జీవితం ఎవరి అంచనాలకు అందదు అంటూ ఎమోషనల్ అయిపోయాడు సిరాజ్. డియోగో జోటా గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు సిరాజ్. పోర్చుగల్‌తో పాటు లివర్‌పూల్ క్లబ్‌కు ఆడుతూ ఎంతో మంది అభిమానాన్ని చూరగొన్నాడు జోటా. ఇటీవల కారు ప్రమాదంలో అతడు చనిపోయాడు. దీంతో ఫుట్‌బాల్ స్టార్ మృతిపై సిరాజ్ పైవిధంగా స్పందించాడు.'గత మ్యాచ్ సమయంలో డియోగో జోటా మృతి గురించి తెలిసింది. నేను పోర్చుగల్ అభిమానిని. అతడు అదే జట్టుకు ఆడతాడు. జోటా చనిపోయాడనే వార్త తెలిసి చాలా ఎమోషనల్ అయిపోయా. జీవితం మన ఊహలకు అందనిది. ఎప్పుడైనా ఏదైనా జరగొచ్చు. మనం ఎవరి కోసం పోరాడుతున్నామో తెలియదు. రేపు ఏం జరుగుతుందో చెప్పలేం. లైఫ్‌కు భరోసానే లేదు. జోటా మరణవార్త తెలిసి షాక్ అయ్యా. అదీ కారు ప్రమాదంలో చనిపోయాడని తెలిసి విస్మయానికి లోనయ్యా. మ్యాచ్‌లో వికెట్ తీయగానే అతడికి అంకితం చేశా' అని సిరాజ్ చెప్పుకొచ్చాడు.

# రెండో రోజు బంతి మార్పుపై వివాదం..

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ చాలా చర్చనీయాంశంగా మారింది. రెండో రోజు బంతి మార్పుపై పెద్ద వివాదం చెలరేగింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్ల తర్వాత రూల్స్ ప్రకారం భారత్ కొత్త బంతిని అందుకుంది. అయితే 10 ఓవర్లు పూర్తయ్యేసరికే బంతి ఆకారం దెబ్బతిన్నది. భారత ఆటగాళ్ల ఫిర్యాదులో బంతిని పరిశీలించిన అంపైర్ మరో బాల్‌ను తెప్పించాడు. 10 ఓవర్లు మాత్రమే ఆడిన బాల్ తీసుకొచ్చాడు. అయితే ఈ బంతి పాతదానికి కంటే మరి ఘోరంగా ఉండటంతో భారత ఆటగాళ్లు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదే విషయాన్ని అంపైర్‌కు చెప్పే ప్రయత్నం చేయగా.. అతను వినిపించుకోలేదు. దాంతో మరింత అసహనానికి గురైన గిల్.. అంపైర్‌తో గొడవపడ్డాడు. ఇప్పుడు జో రూట్ దీనిపై స్పందించాడు.ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జో రూట్ బంతి మార్పుపై మాట్లాడాడు. టీమిండియా తీరుపై రూట్ ప్రశ్నలు లేవనెత్తాడు. డ్యూక్స్ బంతి మార్పుపై ఇంత చర్చ అవసరం లేదని జో రూట్ అభిప్రాయపడ్డాడు. జో రూట్ మాట్లాడుతూ.. "ఒక వేళ బంతి ఆకారం దెబ్బతింటే దానిని మార్చుకోవాలి. కానీ దీనిపై ఎటువంటి రాద్ధాంతం చేయకూడదు. ఇక్కడ ప్రపంచం అంతమైపోయిందని నేను అనుకోవడం లేదు. ఇది ఆటలో ఒక కొత్త మలుపు తీసుకువస్తుందని నేను భావిస్తున్నాను. మార్పులకు అనుగుణంగా మారే సామర్థ్యం మీకు ఉండాలి. దాని వల్ల స్వింగ్ ఆగిపోయినా లేదా మరింత పెరిగినా సరే రాణించే కెపాసిటీ ఉండాలి." అంటూ జో రూట్ అభిప్రాయపడ్డాడు.లార్డ్స్‌లో జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. జో రూట్ 199 బంతుల్లో 104



పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ క్రమంలో 10 ఫోర్లు కొట్టగలిగాడు. లార్డ్స్‌లో జో రూట్ రికార్డు అద్భుతంగా ఉంది. జో రూట్ మరోసారి అదే తరహా ప్రదర్శన చేశాడు. జో రూట్ అద్భుతమైన బ్యాటింగ్ దెబ్బకు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 112.3 ఓవర్లలో 387 పరుగులు చేసింది.భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటివరకు అద్భుతమైన ప్రదర్శన చేసింది. రెండో రోజు చివరి నాటికి టీమిండియా ఆటగాళ్లు 43 ఓవర్లు ఆడి 3 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేశారు. కేఎల్ రాహుల్ ప్రస్తుతం 53 పరుగులతో నాటౌట్‌గా ఉండగా.. కరుణ్ నాయర్ 40 పరుగులు చేసి ఔటయ్యాడు. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ బ్యాట్ నుంచి పరుగులు రాలేదు. ప్రస్తుతం కేఎల్ రాహుల్‌తో పాటు రిషబ్ పంత్ 19 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నాడు. భారత జట్టుకు మూడో రోజు చాలా కీలకం.

# సెంచరీతో చరిత్ర సృష్టించిన కేఎల్ రాహుల్




ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్ దుమ్మురేపుతున్నాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన రాహుల్.. 176 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అద్భుతమైన బ్యాటింగ్‌తో కీలక భాగస్వామ్యాలతో రాహుల్ జట్టును ఆదుకున్నాడు. అయితే సెంచరీ పూర్తయిన వెంటనే షోయబ్ బషీర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. కరుణ్ నాయర్‌తో కలిసి రెండో వికెట్‌కు 61 పరుగులు జోడించిన రాహుల్.. రిషభ్ పంత్‌తో నాలుగో వికెట్‌కు 141 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.క్రికెట్ పుట్టిల్లు లార్డ్స్‌లో రాహుల్‌కు ఇది రెండో సెంచరీ. దాంతో ఓ అరుదైన రికార్డ్‌ను కేఎల్ రాహుల్ తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్‌ల్లో లార్డ్స్ వేదికగా రెండు శతకాలు నమోదు చేసిన తొలి ఆసియా ఓపెనర్‌గా నిలిచాడు. ఈ ఘనతను అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. రాహుల్ కంటే ముందు టీమిండియా దిగ్గజ క్రికెటర్ వెంగ్‌సర్కార్ లార్డ్స్ వేదికగా మూడు సెంచరీలు బాదాడు. లార్డ్స్ వేదికగా కేఎల్ రాహుల్ తన తొలి శతకాన్ని 2021లో నమోదు చేశాడు. ఆ మ్యాచ్‌లో టీమిండియా 151 పరుగుల తేడాతో విజయం సాధించింది. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలు లార్డ్స్ వేదికగా సెంచరీ అందుకోలేకపోయారు. లార్డ్స్ మైదానంలో భారత్ నుంచి 10 మంది బ్యాటర్లు మాత్రమే సెంచరీలు నమోదు చేసి హానర్ బోర్డులో తమ పేరును లిఖించుకున్నారు.ఓవరాల్‌గా కేఎల్ రాహుల్‌కు ఇది 10వ టెస్ట్ సెంచరీ కాగా.. ఇంగ్లండ్ గడ్డపై నాలుగో టెస్ట్ శతకం. దాంతో ఇంగ్లండ్ గడ్డపై మూడు సెంచరీలు సాధించిన తొలి భారత ఓపెనర్‌గా రాహుల్ నిలిచాడు. గ్రేమ్ స్మిత్(5 సెంచరీలు) తర్వాత 2000 నుంచి ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక సెంచరీలు బాదిన విదేశీ ఓపెనర్‌గా రికార్డ్ అందుకున్నాడు. రాహుల్ సాధించిన 10 టెస్ట్ సెంచరీల్లో 9 శతకాలు విదేశీ గడ్డపైనే నమోదు చేయడం గమనార్హం. ఇందులో ఇంగ్లండ్ గడ్డపై నాలుగు, దక్షిణాఫ్రికాలో రెండు, ఆస్ట్రేలియా, శ్రీలంక, వెస్టిండీస్‌లలో ఒక్కో సెంచరీలు ఉన్నాయి. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు 5 ఇన్నింగ్స్‌లు ఆడిన రాహుల్ 42, 137,2, 55, 100 పరుగులతో రాణించాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ‘సూపర్‌మ్యాన్’ సినిమాకు సెన్సార్ కట్స్





సినిమా సెన్సార్‌పై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ తీసుకుంటున్న నిర్ణయాలు మరోసారి విమర్శలకు దారి తీస్తున్నాయి. ఈ ఏడాది విడుదలైన మోహన్‌లాల్ ఎంపురాన్ సినిమాతో పాటు, ఇటీవల వచ్చిన జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ సినిమాలకూ సెన్సార్ పలు కోతలు సూచించిన విషయం తెలిసిందే. దీంతో సెన్సార్ బోర్డు నిర్ణయాలపై పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే ఇండియాలో తాజాగా విడుదలైన హాలీవుడ్ చిత్రం ‘సూపర్‌మ్యాన్’ సినిమాలో కూడా 33 సెకన్ల రొమాన్స్ సన్నివేశాన్ని తొలగించడంపై సినీ ప్రియులు, విశ్లేషకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఇష్టానుసారం కత్తిరించడం వల్ల సినిమా తన సహజత్వాన్ని కోల్పోతుందని, కొన్ని చోట్ల సన్నివేశాలు అర్థం కాకుండా ఉన్నాయని ఇటీవల ప్రీమియర్ చూసిన ప్రేక్షకులు పేర్కొన్నారు. అయితే సెన్సార్ తీసుకుంటున్న ఈ ఏకపక్ష నిర్ణయాలపై నటి శ్రేయా ధన్వంతరి ఆగ్రహం వ్యక్తంచేశారు. సూపర్‌మ్యాన్ సినిమాలో సెన్సార్ కట్ చేసింది నిజమైతే, ఈ ఘటన తనకు నవ్వు తెప్పిస్తుంది అన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక అనవసరమైన విషయం మన దృష్టికి వస్తుందని, ఇది మనకున్న సమస్యల్లో చిన్నదే కావచ్చు కానీ మిగతా పెద్ద సమస్యల గురించి మనం ఏమైనా ఆలోచిస్తున్నామా అంటే లేదు. ఇలానే ప్రతిరోజూ ఏదో ఒక చెత్త విషయం జరుగుతూనే ఉందంటూ శ్రేయా తన ఆవేదన వ్యక్తం చేసింది. శ్రేయా సినిమాల విషయానికి వస్తే, తెలుగులో నాగ చైతన్య ‘జోష్’ సినిమాతో పాటు ‘స్నేహగీతం’ సినిమాలో నటించారు. అమెజాన్ ప్రైమ్ వీడియోలో వచ్చిన ‘ది ఫ్యామిలీ మ్యాన్’ వెబ్ సిరీస్ శ్రేయాకి మంచి గుర్తింపును తీసుకువచ్చింది.

# రీఎంట్రీ ఇస్తోన్న వడ్డే నవీన్

## కాకపోతే ఓ ట్విస్ట్!

సినిమా ఇండస్ట్రీలో స్టార్‌డమ్ సంపాదిస్తే సరిపోదు, దాన్ని అలాగే కాపాడుకోగలిగాలి. లేదంటే ఏమాత్రం తేడా వచ్చినా వెండితెరపై కనిపించకుండా పోతారు. టాలీవుడ్ హీరో వడ్డే నవీన్ విషయంలో ఇదే జరిగింది. ఒకప్పుడు ఎన్నో హిట్ సినిమాలు చేసిన ఇతడు చాలా కాలంగా తెలుగు తెరకు కనిపించకుండా పోయాడు. ప్రముఖ నిర్మాత వడ్డే రమేశ్ కుమారుడిగా నవీన్ ఇండస్ట్రీలో అడుగుపెట్టాడు. కోరుకున్న ప్రియుడు చిత్రంతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. రెండో సినిమా పెళ్లితో నవీన్ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. మనసిచ్చి చూడు, స్నేహితులు, చెప్పాలని ఉంది, చాలా బాగుంది, మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిది వంటి పలు సినిమాలతో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యాడు. చివరగా 2016లో ఎటాక్ చిత్రంలో కనిపించాడు. ఆ తర్వాత వెండితెరపై కనిపించనేలేదు. 9 ఏళ్ల తర్వాత ఇతడు విలన్‌గా రీఎంట్రీ ఇవ్వనున్నట్లు ఆ మధ్య ప్రచారం జరిగింది. కానీ ఇంతవరకు దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. యాక్టింగ్ సంగతి పక్కనపెడితే నవీన్ నిర్మాతగా మారనున్నాడు. వడ్డే క్రియేషన్స్ పేరిట నిర్మాణ సంస్థను ప్రారంభించినట్లు తెలుస్తోంది. నటుడిగా కమ్‌బ్యాక్ ఇస్తాడనుకుంటే ఇలా నిర్మాత అవతారం ఎత్తి ట్విస్ట్ ఇచ్చాడంటున్నారు అభిమానులు. ఏదేమైనా సినిమా ఇండస్ట్రీలో నవీన్ సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నారు.



# పెళ్లి అంటేనే భయమేస్తోంది



ఇంటర్నెట్ డెస్క్: తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకుంటుంటారు నటి శ్రుతి హాసన్ మరికొన్ని రోజుల్లో ‘కూలీ’తో పలకరించనున్న ఆమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. రజనీకాంత్‌తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. శ్రు తి పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

**అది జీవితకాలపు బాధ్యత..**

“నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడిపెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవితకాలపు బాధ్యత”

**తొలి విజయాన్ని ఇచ్చిన టాలీవుడ్..**

“పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన ‘గబ్బర్ సింగ్’లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలేనన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది”

**ఒకరితో ఒకరిని పోల్చలేం..**

“మా నాన్న రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీకి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టికోణంలోనే ఆయన నాకు తెలుసు. ‘కూలీ’ సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులు ఉన్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి. అమితాబ్ బచ్చన్ కమల్ హాసన్, రజనీకాంత్.. వీరందరినీ ఒకరితో ఒకరిని పోల్చలేం” అని శ్రుతి వివరించారు.

# ఓటీటీలోకి ‘కలియుగం-2064’

ఇంటర్నెట్ డెస్క్: శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కలియుగం-2064’ ప్రమోద్ సుందర్ దర్శకత్వంలో రూపొందింది. తమిళ, తెలుగు భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రం మే 9న విడుదలైంది. ఇప్పుడీ మూవీ సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. ఆహా వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. గతేడాది సైన్స్ ఫిక్షన్ మూవీ ‘కల్కి 2898 ఏడీ’ ప్రేక్షకుల ముందుకువచ్చి ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇదేతరహాలో ‘కలియుగం-2064’ను రూపొందించారు. గ్రాఫిక్స్‌కు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. 2064 సంవత్సరంలో ఈ మానవాళికి ఏమవుతుంది.. ఎలాంటి మార్పులు సంభవిస్తాయి? అనే విషయాల్ని ఆధారంగా చేసుకొని తెరకెక్కించారు.



# బుల్లితెరపై సర్ప్రైజ్ ఇచ్చిన తండేల్

హిట్టు కోసం చకోరపక్షిలా ఎదురు చూస్తున్న నాగచైతన్యకు తండేల్ రూపంలో సూపర్ సక్సెస్ దక్కడం ఫ్యాన్స్ ని సంతోషంలో ముంచెత్తింది. ఫిబ్రవరిలో రిలీజైన ఈ ఎమోషనల్ ఎంటర్ టైనర్ చైతుకు మొదటి వంద కోట్ల గ్రాసర్ గా నిలిచి మార్కెట్ ని నిలబెట్టింది. మరీ ఇండస్ట్రీ రికార్డులు బద్దలు కొట్టే స్థాయిలో కాకపోయినా డ్రైగా అనిపించే ఫిబ్రవరిలో అంత విజయం సాధించడం విశేషమే. అయితే అసలు ట్విస్టు ఇది కాదు. తండేల్ హోమ్ ఆడియన్స్ కి ఎక్కువ రీచ్ అయ్యిందని చెప్పడానికి శాటిలైట్ టిఆర్పి రేటింగ్ నిదర్శనంగా నిలుస్తోంది. నిజానికి ఇంత రెస్పాన్స్ బహుశా ఫ్యాన్స్ ఊహించి ఉండరు.టీవీ వర్గాల రిపోర్ట్స్ ప్రకారం తండేల్ టెలివిజన్ ప్రీమియర్ 10.32 రేటింగ్ తెచ్చుకుంది.



ఈ సంవత్సరం ఇలా డబుల్ డిజిటల్ తెచ్చుకున్న సినిమాలు రెండే. సంక్రాంతికి వస్తున్నాం 15.92 తో అగ్ర స్థానంలో ఉండగా పుష్ప 2 ది రూల్ 12.61 తో సెకండ్ ప్లేస్ లో ఉంది. ఇప్పుడు తండేల్ మూడో స్థానం తీసుకుంది. వెంకటేష్, బన్నీ సినిమాలతో పోలిస్తే చైతు మూవీ థియేట్రికల్ గా భీభత్సంగా ఆడలేదు. కానీ చిన్నితెరపై మాత్రం వాటితో పోటీ పడే స్థాయిలో పెర్ఫార్మ్ చేసింది. సముద్రం బ్యాక్ డ్రాప్, చైతన్య సాయిపల్లవిల జంట, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం వెరసి రీచ్ ఎక్కువ వచ్చేందుకు దోహదపడ్డాయి. ఒకపక్క శాటిలైట్ మార్కెట్ అంతకంతా పడిపోతోందని నిర్మాతలు టెన్షన్ పడుతున్న ట్రెండ్ లో తండేల్ కొచ్చిన నెంబర్లు ఉత్సాహాన్ని ఇచ్చేవే. కాకపోతే అన్ని సినిమాలకు ఇలాంటి ఫలితాలు ఆశించలేం. ఓటిటిలో నెల రోజులకే కొత్త చిత్రాలు స్ట్రీమింగ్ కు వస్తున్న నేపథ్యంలో యాడ్స్ తో కూడిన ప్రసారాన్ని చూసేందుకు ఎక్కువ శాతం ప్రేక్షకులు మొగ్గు చూపడం లేదు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613